## ప్రశాంతంగా సివిల్స్ ప్రిలిమినరీ

సిటీ బ్యూరో, మే 25 (నమస్తే తెలంగాణ): యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ఆదివారం సైఫాబాద్‌లోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్‌లో 123 మంది దృష్టి వైకల్యం గల అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అనంతరం బేగంపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలోని సెంటర్‌లో పరీక్ష తీరును పరిశీలించారు. జిల్లాలో మొత్తం 43,676 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా మొదటి సెషన్‌లో 26,032 మంది హాజరయ్యారని 17,644 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. 2వ సెషన్‌లో 25,787 మంది అభ్యర్థులు హాజరుకాగా 17,889 మంది గైర్హాజరయ్యారని కలెక్టర్ తెలిపారు.

## జీపీవో పరీక్షకు 35 మంది హాజరు

సిటీ బ్యూరో, మే 25 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ జిల్లాలో గ్రామ పాలనాధికారి పరీక్షను సమర్థవంతంగా నిర్వహించామని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఆదివారం నిజాం కాలేజీలోని గ్రామపాలన అధికారి పరీక్షా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. 39 అభ్యర్థులకు గాను 35 మంది హాజరయ్యారని కలెక్టర్‌కు పరీక్ష నిర్వహణ అధికారులు వివరించారు. పరీక్ష నిర్వహణ తీరు, ఏర్పాట్లపై కలెక్టర్ ఆరా తీశారు.

## ఔషధ మొక్కలతో అధిక లాభాలు

వ్యవసాయ యూనివర్సిటీ (హైదరాబాద్), మే 25: ఔషధ, సుగంధ మొక్కల సాగు పెంచాల్సిన అవసరం ఉందని వ్యవసాయ వర్సిటీ ఔషధ మొక్కల విభాగం హెడ్ డాక్టర్ కృష్ణవేణి సూచించారు. వర్సిటీ ఆవరణలో శనివారం ముగిసిన ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో పలువురు శాస్త్రవేత్తలు పాల్గొని విలువైన సూచనలు చేశారని.. వాటిని విధిగా పాటిస్తూ రైతులు మరింత సాగును పెంచాల్సిన అవసరం ఉందన్నారు.

# ప్రలోభాలకు లొంగని వ్యక్తి సిధారెడ్డి

- మాజీ మంత్రి హరీష్ రావు
- మాసబ్‌ట్యాంక్‌లో ఘనంగా సిధారెడ్డి ఆత్మీయ సన్మాన కార్యక్రమం



సిధారెడ్డి దంపతులను సన్మానిస్తున్న హరీశ్‌రావు, చిత్రంలో దేశపతి తదితరులు

మెహిది పట్నం మే 25: కవిత్వంతో, సామాజిక కృషితో తెలంగాణ సమాజం మీద బలమైన ప్రభావం వేసిన వ్యక్తి నందిని సిధారెడ్డి అని, తెలంగాణ గడ్డ మీద జరిగిన ప్రతి ఉద్యమంలోనూ ఆయన పాత్ర గణనీయంగా ఉందని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. ఆదివారం మాసబ్ ట్యాంక్లోని కాంటినెంటల్ పార్క్ హోటల్లో సిధారెడ్డి ఆత్మీయ సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ.. నాకు సిధారెడ్డితో రెండు దశాబ్దాలకు పైబడిన అనుబంధం ఉందన్నారు. ఆయన చాలా నిరాడంబరంగా చాలా నిక్కచ్చిగా ఉంటారన్నారు. ఒకరి నుంచి ప్రయోజనం పొందడం కోసమో, ఒకరి నుంచి మెప్పు పొందడం కోసమో చాలా మంది తమ అభిప్రాయాలను ఈజీగా మార్చుకుంటరని, సిధారెడ్డి మాత్రం నమ్మిన విషయాల పట్ల నిజాయితీగా, నిబద్ధతతో ఉంటూ దేని కోసం రాజీ పడకపోవడం అదే ఆయనలోని ప్రత్యేకత అన్నా రు. తెలంగాణ ఉద్యమం కోసం తన ప్రమోషన్ సైతం వదులుకున్నారని తెలిపారు.

### ఆకాశం అంత ఎత్తుకు ఎదిగారు..

సిధారెడ్డి ప్రలోభాలకు లొంగరన్నారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం సిధారెడ్డికి కోటి రూపాయలు, 300 గజాల జాగ ఇవ్వదలిచినప్పుడు మీరు ఆరు గ్యారెంటీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారంటూ ఆ అవార్డు తీసుకోకుండా తిరస్కరించారన్నారు. తెలంగాణ తల్లి రూపం మార్చినందుకు నిరసన తెలియజేసి, ప్రభుత్వం ఇవ్వజూపిన అవార్డును తిరస్కరించడంతో సిధారెడ్డి వ్యక్తిత్వం ఆకాశమంత ఎత్తుకెదిగిందని పేర్కొన్నారు. అందుకే ఆయన కవిత్వం, వ్యక్తిత్వం అంటే ఎంతో ఇష్టం అని సిధారెడ్డి వారి కవిత్వంలో స్పృశించని అంశం లేదని, ముఖ్యంగా తెలంగాణ రైతుల కష్టాల గురించి, కన్నీళ్ల గురించి రాసిన కవితలు అద్భుతంగా ఉంటాయని హరీష్ రావు చెప్పారు. రైతులు, స్త్రీలు, దళితులు, సమాజంలో అణిచివేతకు గురవుతున్న అందరి పక్షాన నిలబడి కవిత్వం రాసారని రైతుల గురించి బోరు దు:ఖం అనే ఒక అద్భుతమైన కవిత రాసిండన్నారు. సిధారెడ్డికి 70ఏళ్లు నిండిన సందర్భంగా ఆత్మీయులందరం కలిస్తే బాగుంటదని దేశపతి, విరాహత్‌లు చెప్పగానే వెంటనే నేను ఒప్పుకున్నా అని తెలిపారు. ఇవాళ ఈ ఆత్మీయ అభినందన సభలో పాల్గొన్నందుకు చాలా సంతోషంగా ఉందని, సిధారెడ్డి నిండు నూరేళ్లు సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. వారు మరెన్నో రచనలు చేసి, సమాజాన్ని చైతన్య పరచాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా అన్నారు.

### కవిత్వంలో దుఖం, వ్యంగం ఉంటుంది..

సిధారెడ్డి కవిత్వంలో దుఖం ఉంటది, వ్యంగ్యం ఉంటది, కానీ ఏది రాసినా అది అద్భుతంగా ఉంటదని, సిధారెడ్డి కేవలం కవిత్వం రాయడంతోనే తన బాధ్యత తీరిందనుకోలేదని, మెదక్ జిల్లాలో మంజీరా రచయితల సంఘాన్ని స్థాపించి ఎంతో మంది కవులను తీర్చిదిద్దారన్నారు. దేశపతి శ్రీనన్న, తైదల అంజయ్య ఇంకా చాలామంది కవులు సిధారెడ్డి చేత, మంజీరా రచయితల సంఘం చేత ప్రభావితమై, ఎదిగి వచ్చారని చెప్పారు. ఉద్యోగ సంఘాల నేతగా ఎదిగిన మా దేవి ప్రసాద్, దుబ్బాక ఎమ్మెల్యేగా పనిచేసిన రామలింగా రెడ్డి, జర్నలిస్టు సంఘం అధ్యక్షుడు విరాహత్ అలీ, సీనియర్ జర్నలిస్టు రంగాచారి ఇట్ల ఎంతో మందికి సిధారెడ్డి ప్రేరణ అని చాలా మందికి తెలుసన్నారు. మాజీ సీఎం కేసీఆర్, సిధారెడ్డి క్లాస్‌మేట్స్ అని ఒకరంటే మరొకరికి గొప్ప గౌరవం. అనుబంధం ఉన్నాయని, సిధారెడ్డి సామర్థ్యం తెలుసు గనుకనే కేసీఆర్ సార్ తెలంగాణ సాహిత్య అకాడమీ నెలకొల్పి దానికి మొదటి అధ్యక్షుడిగా సిధారెడ్డినే నియమించారని గుర్తుచేశారు.సిధారెడ్డి నేతృత్వంలోనే ప్రపంచ తెలుగు మహాసభలు ఎంతో గొప్పగా, విజయవంతంగా జరిగి, ప్రభుత్వానికి, తెలంగాణకు ఎంతో పేరు వచ్చిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రపంచ తెలుగు మహా సభలు నిర్వహిస్తే, ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రపంచ సుందరీమణుల పోటీలు పెడుతున్నదని విమర్శించారు.70 ఏళ్లు పూర్తి చేసుకున్న సిధారెడ్డికి శుభాకాంక్షలు తెలిపి,నిండు నూరేళ్లు సంతోషంగా ఉండాలని మరెన్నో రచనలు చేయాలని కోరుకుంటున్నానన్నారు. అనంతరం సిధారెడ్డి దంపతులను హరీష్‌రావు ఘనంగా సన్మానించారు.

# రాజ్యాధికారమే లక్ష్యం కావాలి

- బీసీ ఉద్యమం గ్రామస్థాయి నుంచి బలోపేతం కావాలి
- శాసన మండలి ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ మధుసూదనాచారి

ఖైరతాబాద్, మే 25 : రాజ్యాధికారమే లక్ష్యంగగా బీసీలు ముందుకు సాగాలని ఎమ్మెల్సీ, శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. బీసీ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కోటి బీసీ కార్యకర్తల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం వ్యవస్థాపకులు చిరంజీవులు, సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేశ్‌తో కలిసి ప్రారంభించారు. మధుసూదనాచారి మాట్లాడుతూ.. దేశంలో అనేక ప్రభుత్వాలు ఏర్పడినా బీసీల సంక్షేమానికి ఎవరూ పాటుపడలేదన్నారు. బీసీల ఓట్లతో గద్దెనెక్కుతూ వారి సంక్షేమాన్ని విస్మరించారన్నారు. బీసీలో చైతన్యం ప్రారంభమైందని.. అది ఇప్పుడు మండల స్థాయికి చేరిందని, గ్రామ స్థాయి నుంచి బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో బీసీలు ఓట్లు వేసి సంక్షేమ పథకాలను అడుక్కునే వారని, కానీ ఇప్పుడు పరిస్థితి మారుతుందన్నారు. బీసీలందరూ బలోపేతమవుతున్నారని, కోటి బీసీ కార్యకర్తల సభ్యత్వ నమోదుతో పార్టీలకు తమ సత్తాను చూపించాలన్నారు. దేశంలోని బీసీలు అడుక్కునే స్థాయి కాకుండా ఇచ్చే స్థాయికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి బీసీ వ్యక్తి గర్వంగా సమితిలో సభ్యుడిని చెప్పుకునే విధంగా కార్యాచరణ ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, బీజేపీ బీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, బీసీ నాయకులు గుజ్జ కృష్ణ, అరుణశ్రీ, వైద్య రాజగోపాల్, వీరేందర్ గౌడ్, బండారు పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న మధుసూదనాచారి, బీసీ నేతలు

## ప్రొఫెసర్ క్వార్టర్లు.. 30 ఏండ్ల లీజుకు..

(మొదటిపేజీ తరువాయి)

యూనివర్సిటీలోని ఒక్క అంగుళం భూమిని కూడా ప్రైవేట్‌పరం చేయొద్దని డిమాండ్ చేశారు. యూనివర్సిటీకి చెందిన భూములు, భవనాలను ప్రైవేట్ వ్యక్తులు, సంస్థలకు లీజుకివ్వడం జస్టిస్ చిన్నప్పరెడ్డి కమిటీ నివేదికను ప్రత్యక్షంగా ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొన్నారు. లీజుకు తీసుకున్న ఆది ధ్వని ట్రస్టు 30 సంవత్సరాల దీర్ఘకాలిక కింద అదనపు క్వార్టర్లను కోరుతుండటం ఆందోళన కలిగిస్తున్నదన్నారు. లీజును వెంటనే రద్దు చేయకుంటే న్యాయపరమైన పోరాటం చేస్తామని, అనుచితంగా అనధికారికంగా లీజుకిచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లీజుకు తీసుకున్న ఆది ధ్వని ట్రస్ట్ వారు క్వార్టర్స్ రేనోవేషన్ పనులు చేస్తున్నారని, క్వార్టర్స్‌లో ఎలాంటి మరమ్మతులు చేయడానికి అనుమతులు ఉండవని చెప్పారు. ప్రొఫెసర్లు నివాసమున్నప్పుడే మరమ్మతులకు అనుమతించని వీసీ, ఈసీ...వారికెలా అనుమతి ఇచ్చిందని ప్రశ్నించారు. లీజు రద్దు చేయకుంటే క్వార్టర్స్ పరిధిలోని ఎకరం భూమి అన్యాక్రాంతమయ్యే ప్రమాదమున్నదని ఆందోళన వ్యక్తం చేశారు.

# భాషపైన అభిమానం పెంచుకోవాలి

**సారస్వత పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి**



మాట్లాడుతున్న ఆచార్య ఎల్లూరి శివారెడ్డి

తెలుగు యూనివర్సిటీ, మే 25. ఉత్తమ సమాజ నిర్మాణానికి బాల సాహిత్యం ఎంతో దోహదపడుతుందని వక్తలు అభిప్రాయపడ్డారు. అబిడ్స్ బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో శాంతా-వసంతా ట్రస్టు సౌజన్యంతో ఆదివారం కోడూరు శాంతమ్మ స్మారక బాల సాహిత్య సమ్మేళనం సందడిగా కొనసాగింది. సారస్వత పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమ్మేళనంలో ముఖ్య అతిథిగా హాజరైన శాంతా వసంతా ట్రస్టు అధినేత, పద్మభూషణ్ డాక్టర్ కేఐ వరప్రసాద్‌రెడ్డి ప్రసంగిస్తూ తన తల్లి చెప్పిన కథలే తన జీవితాన్ని ప్రభావితం చేశాయన్నారు. భాషపైన అభిమానంసాహిత్యాభిరుచి అలవరచుకుంటే ఉత్తమ రచయితలుగా, ఉత్తమ పౌరులుగా తయారయ్యేందుకు దోహదపడతాయని అన్నారు. బాల సాహితీవేత్తలు గరిపెల్లి అశోక్, డాక్టర్ పత్తిపాక మోహన్, డాక్టర్ వీఆర్ శర్మ, చొక్కాపు వెంకటరమణ, డాక్టర్ దాసరి వెంకట రమణ, డాక్టర్ అమరవాది నీరజ, చంద్ర శేఖర అజాద్, డి కె చదువుల బాబుతో పాటు ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన 150 మంది ప్రతినిధులు, 65 మంది వక్తలు పాల్గొని బాల సాహిత్యంలో రావలసిన మార్పులపై విస్తృత చర్చ జరిగింది. ఈ సందర్భంగా బాల సాహిత్య రంగంలో విశిష్ట సేవలందిస్తున్న ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన బాల సాహితీవేత్తలకు, ఉపాధ్యాయులకుఒక్కొక్కరికి రూ2,500 నగదు, శాలువా, జ్ఞాపికతో వరప్రసాద్ రెడ్డి ఘనంగా సత్కరించారు. పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ చెన్నయ్య సదస్సును సమన్వయం చేశారు.

# ఉద్యమకారుల హామీలను నెరవేర్చాలి

**బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు**

ఖైరతాబాద్, మే 25: తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ అధికారంలోకి వస్తే తక్షణమే తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇస్తామని, పెన్షన్ సౌకర్యాలు కల్పిస్తామంటూ హామీ ఇచ్చిందని, రెండేండ్లు గడుస్తున్నా ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదన్నారు. స్వయంగా ఈ హామీని ఎన్నికల మ్యానిఫెస్టో పెట్టి విస్మరించడం సరికాదన్నారు. ప్రజాభవన్‌కు మహాత్మా జ్యోతిరావు పూలే పేరు పెట్టారని, కాని అక్కడ వచ్చే దరఖాస్తులు ఎక్కడపోతున్నాయో ఎవరికి తెలియదన్నారు. జూన్ 2 లోగా ప్రభుత్వం నుంచి ఉద్యమకారులకు స్పష్టమైన హామీని ఇవ్వాలని, లేని పక్షంలో ఉద్యమకారుల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, వెన్నల గద్దర్, కొండ స్వామి, ఐలయ్య, కృష్ణారావు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కృష్ణ మోహన్ రావు

# గల్లంతు మతలబేంటి?

(మొదటిపేజీ తరువాయి)

ఈ మీటర్లను గుర్తించడం ఎలా అని అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఈ వ్యవహారం పూర్తిగా బయటకు వస్తే మరికొంతమంది అధికారులపై కూడా వేటు పడే అవకాశం ఉంది. వాస్తవానికి చిత్రపురి కాలనీలో ఉన్న 225 ఇళ్లకు విద్యుత్ కనెక్షన్ కోసం 2021 ఆగస్ట్ 21న రిజిస్టర్ చేయగా 2025 జనవరి 7న మంజూరి చేశారు. ఈ మధ్యలో ఎస్టిమేట్‌లు రివైజ్ చేయడం, వినియోగదారుడు చెల్లించడం వంటివి జరిగాయి. 2024 ఫిబ్రవరిలో ఎస్టిమేట్ క్లోజ్ చేశారు. అయితే ఇక్కడ మీటర్ బిగించకుండా ఒకనెల బిల్లు రాకుండా ఎస్టిమేషన్ క్లోజ్ చేయడం గమనార్హం. ఈ వ్యవహారంలో కాంట్రాక్టర్‌తో పాటు అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది చేతివాటం ప్రదర్శించడం వల్లే మీటర్ల గోల్‌మాల్ జరిగిందని ఎస్పీడీసీఎల్ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు.

### నిబంధనలకు విరుద్ధంగా కేటగిరీ మార్పు..!

చిత్రపురి కాలనీలో అక్రమంగా నిల్వ ఉంచిన విద్యుత్ మీటర్లు కేటగిరీ-1 కింద అలాట్ అయినట్లు తెలుస్తోంది. దాదాపు 225 మీటర్లు ఇవ్వాల్సి ఉండగా, మొదటి దశలో 42 మీటర్లు ఇచ్చినట్టుగా అధికారులు తెలిపారు. మరికొన్ని మీటర్లు కూడా మంజూరీ అయి బిల్లులు వస్తున్నాయని.. అయితే వీటిలో అత్యధికంగా బిల్లులు వస్తున్న వాటి జాడే లేకుండా పోయిందని డివిజన్‌కు చెందిన క్షేత్రస్థాయి సిబ్బంది చెబుతున్నారు. ప్రధానంగా కొంతమంది వినియోగదారుల ఇళ్లకు ఎన్ఓసీ లేకున్నా మొదటి కేటగిరీలో మీటర్లు ఇవ్వడం నిబంధనలకు విరుద్ధమని ఆ శాఖ అధికారులే చెబుతున్నారు. ఎన్ఓసి లేనప్పుడు కేటగిరీ-2 కింద మీటర్లు ఇవ్వాల్సి ఉంటుందని, అప్పుడు కరెంట్ బిల్లు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. ఒకవైపు మీటర్లు బిగించకుండా నిల్వ ఉంచడమే కాకుండా కేటగిరి మార్చడంతో విద్యుత్ సిబ్బంది తమ ప్రయోజనాల కోసం సంస్థ ఆదాయానికి గండి కొట్టారని ఇప్పుడు డిస్కంలో జోరుగా చర్చ సాగుతోంది. అక్రమంగా నిల్వ ఉంచిన మీటర్లకు గచ్చిబౌలి సబ్‌స్టేషన్ పరిధిలో పనిచేస్తున్న సిబ్బంది బిల్లులు ఇచ్చారు. మీటర్ల గోల్‌మాల్ వ్యవహారంలో డిస్కం అధికారులు ప్రైవేట్ వ్యక్తులతో మిలాఖత్ అయి ఈ దందా నడిపినట్లు సమాచారం. ఇప్పటివరకు 225 మీటర్లలో ఎన్ని మీటర్లు ఇచ్చారు.. అవి ఎక్కడ ఉన్నాయి. వాటి ప్రస్తుత పరిస్థితి ఏంటనే దిశగా డివిజన్ అధికారులు ఆరా తీస్తున్నా.. ఉన్నతస్థాయిలో మాత్రం వీటిపై ఎలాంటి సమాచారం లేదు. గచ్చిబౌలి డివిజన్‌కి సబంధించి విద్యుత్ మీటర్ల వ్యవహారంలో ఎవరూ తలదూర్చవద్దంటూ డిస్కంకు చెందిన ప్రధాన అధికారి నుంచి కిందస్థాయి అధికారులకు మౌఖికంగా ఆదేశాలు వచ్చినట్లు సమాచారం.

## బీఆర్ఎస్ జీవోకు కాంగ్రెస్ తూట్లు

(మొదటిపేజీ తరువాయి)

స్టైఫండ్‌లో సైతం కోతలు పెడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే క్యాంపులకు వెళ్లినప్పుడు బస్ ఛార్జీలు,భోజనం పేరుతో కోత పెడుతున్నారు. ఈ సమస్యపై అనేకసార్లు మెడికోలు అధికారులను కలిసినా ఫలితం శూన్యంగానేమిగిలింది. వినతిపత్రాలు తీసుకోవడమే తప్ప సమస్యలు పరిష్కరించడంలో శ్రద్ధ చూపడంలేదనే విమర్శ ఉంది. ఇదిలా ఉండగా రాష్ట్ర వ్యాప్తంగా మెడికోలంతా కలిసి తమ సమస్యను పరిష్కరించి, 2023లో తెచ్చిన జీవో ప్రకారం స్టైఫండ్ విడుదల చేయాలనివైద్యారోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోవడంలో పురోగతి లేదు. అధికారులు, ప్రభుత్వం స్పందించకపోవడం వల్ల ప్రైవేట్ మెడికల్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు స్టైఫండ్ విషయంలో అన్యాయం చేస్తున్నాయి.

## నాగరికత నేర్పింది విశ్వకర్మలే..

**విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర రాజు**



గండదీపం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

చిక్కడపల్లి, మే 25: విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ 9వ వార్షికోత్సవం ఆదివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు విశ్వనాదుల పుష్పగిరి రచించిన 'గండదీపం- కవిత్వ' పుస్తకావిష్కరణ, విశ్వకర్మ యంగ్ లీడర్ అవార్డ్స్ ప్రధనోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పుస్తకాన్ని ప్రముఖ కవి డా.అంబటి సురేంద్రరాజు, సీనియర్ జర్నలిస్ట్ రమేష్ హజారీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంబటి సురేంద్ర రాజు మాట్లాడుతూ.. సమాజానికి నాగరికత నేర్పింది విశ్వకర్మలేనని అన్నారు. పుస్తకంలో జీవిత అనుభవాలను కవిత్వంగా రాసారని పేర్కొన్నారు. సీనియర్ జర్నలిస్ట్ రమేష్ హజారి మాట్లాడుతూ.. మన తెలంగాణ మలి ఉద్యమ పోరాటంలొ సకలజనులు చైతన్యమై పోరు సల్పారని ఇప్పుడు సాధించుకున్న హక్కులను కాపాడుకునేందుకు ఉద్యమించాలని అన్నారు. తెలుగు సాహిత్యంలో ఆధునికంగా వినిపిస్తున్న గొప్ప కవుల జాబితాలో పుష్పగిరి కూడా వారి సరసన నిలబడే గొప్ప కవిత్వాన్ని రాస్తున్నారని ప్రశంసించారు. కుల వృత్తికులాల ఐక్యతకు ఈ కవిత్వం ప్రతీకగా నిలుస్తోందని అన్నారు. ఆ సంస్థ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఆకారపు శ్రీనివాస విశ్వకర్మ, ప్రధాన కార్యదర్శి సోలేటి ప్రభాకరాచారి, కే కిరణ్ కుమార్ ఆచారి, గణేష్ బాబు పాల్గొన్నారు.

## జూన్ 8న తెలంగాణ రన్

అమీర్‌పేట్, మే 25: ఆరోగ్యంపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా జూన్ 8న నెక్లెస్ రోడ్‌లో తెలంగాణ రన్ నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. అవంతిక కన్‌స్ట్రక్షన్స్ సమర్పణలో తెలంగాణ రన్నర్స్ సొసైటీ, తెలంగాణ ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో జరగనున్న ఈ రన్‌కు సంబంధించి తెలంగాణ రన్ ఫినిషర్ మెడల్, టీషర్ట్‌లను ఆదివారం బేగంపేట్‌లోని హోటల్ హరిత ప్లాజాలో తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆవిష్కరించారు. ఇందుకు సంబంధించిన వివరాలను తెలంగాణ రన్ సమర్పకులు, అవంతిక కన్‌స్ట్రక్షన్స్ ఎండీఎం శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. 3కే, 5కే, 10కే, 21కే విభాగాల్లో జరుగుతున్న ఈ పోటీల్లో పాల్గొనాలనుకునే ఔత్సాహికులు 9849493010 (జగన్), 9949113931 (శ్రీకాంత్) నంబర్లలో గాని https://runnersoftelangana.com వెబ్‌సైట్‌లో గాని పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. తెలంగాణ ఆబ్కారి శాఖ అదనపు కమిషనర్ ఖురేషి, తెలంగాణ రన్-2025 రేస్ డైరెక్టర్ జగన్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

# మేమింతే..

- కేసులు పెట్టినా మారని కబ్జాదారుల తీరు
- పలుమార్లు ప్రభుత్వ స్థలాల కబ్జాకు యత్నం
- రెవెన్యూ అధికారులకు సవాల్ విసురుతున్న వైనం
- నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టాలని డిమాండ్

బంజారాహిల్స్, మే 25: మా మీద ఎన్నికేసులు పెట్టినా.. జైలుకు పంపించినా.. ప్రభుత్వ, ఖాళీ స్థలాల కబ్జా మాత్రం ఆపము.. మా తీరు ఇంతే.. మేమింతే అనే రీతిలో బరితెగిస్తున్నారు కబ్జాదారులు. ఓవైపు ఖరీదైన ప్రభుత్వ స్థలాలను కాపాడేందుకు నిరంతరం రెవెన్యూ సిబ్బందినిఘా పెడుతుంటే.. మరోవైపు ఆ స్థలాలను కబ్జా చేసేందుకు ప్రయత్నించే క్రమంలో ప్రభుత్వ హెచ్చరిక బోర్డులను సైతం తొలగిస్తూ అధికారులకు సవాల్ విసురుతున్నారు కబ్జాదారులు. నగరంలోనే అత్యంత ఖరీదైన ప్రాంతంగా ఉన్న షేక్‌పేట మండల పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, షేక్‌పేట తదితర ప్రాంతాల్లో పలు బస్తీలు, కాలనీల్లో ఖాళీ ప్రభుత్వ స్థలాలు ఉన్నాయి. ఈ స్థలాల్లో ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, వాటిలోకి ఎవరూ ప్రవేశించకుండా చూడటం కోసం ల్యాండ్ ప్రొటెక్షన్ పేరుతో రెవెన్యూ సిబ్బంది పని చేస్తుంటారు. మండల పరిధిలో సుమారు 130 ల్యాండ్ పార్సల్స్ ఉండగా వాటిలో సుమారు 30 నుంచి 40దాకా యూఎల్‌సీ ల్యాండ్స్ ఉన్నాయి. వీటిని కాపాడేందుకు తాత్కాలిక ప్రహరీలు నిర్మించడంతో పాటు స్థలాల్లో ప్రభుత్వ హెచ్చరిక బోర్డులను సైతం ఏర్పాటు చేశారు. అయితే ప్రభుత్వ హెచ్చరిక బోర్డులను రాత్రికి రాత్రే మాయం చేస్తున్న కొంతమంది కబ్జాదారులు స్థలాన్ని ఆక్రమించేందుకు యత్నిస్తుండగా, మరికొంతమంది బోర్డులు తొలగించి వాటి స్థానంలో స్థలం తమదంటూ రాతలు, పోస్టర్లు ఏర్పాటు చేసుకుంటూ రెవెన్యూ అధికారులకు సవాల్ విసురుతున్నారు. స్థలం బయట ప్రభుత్వ హెచ్చరిక బోర్డు తీసేసిన తర్వాత లిటిగేషన్ ల్యాండ్ అంటూ రియల్ ఎస్టేట్ ఏజెంట్లను తీసుకువచ్చి కస్టమర్లకు చూపిస్తున్నారు. సదరు స్థలాన్ని చూసేందుకు వచ్చేవారిని బురిడీ కొట్టించి అందిన కాడికి దండుకుంటున్న ఘటనలు కూడా కోకొల్లలుగా ఉన్నాయి. ఈ క్రమంలో షేక్‌పేట మండల పరిధిలో రెవెన్యూ అధికారులు నిత్యం ప్రభుత్వ స్థలాలను చెక్ చేయడంతో పాటు ఎవైనా ఫిర్యాదులు వస్తే వెంటనే రంగంలోకి దిగి పోలీసులకు ఫిర్యాదులు చేస్తున్నారు.




బంజారాహిల్స్ రోడ్‌నం 14లోని ప్రభుత్వ స్థలం బయట ప్రైవేట్ వ్యక్తులు ఏర్పాటు చేసిన పోస్టర్

### షేక్‌పేట మండల పరిధిలో ఇటీవల నమోదైన కేసులు

- ఈ క్రమంలో బంజారాహిల్స్ రోడ్ నంబర్ 10లో జలమండలి రిజర్వాయర్ పక్కన రూ.300కోట్ల విలువైన సుమారు 5 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు పార్థసారథి అనే వ్యక్తి ఇప్పటివరకు అనేకసార్లు ప్రయత్నించాడు. ఎప్పటికప్పుడు రెవెన్యూ సిబ్బంది అక్కడకు రావడం, ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు పెట్టడంతో పాటు రేకుల మీద సైతం హెచ్చరిక బోర్డులు రాసినా రాత్రికి రాత్రే వాటిని తొలగించిన ఘటనలున్నాయి. ఈ మేరకు 3 నెలల వ్యవధిలో రెండుసార్లు పార్థసారథితో పాటు అతడి అనుచరుల మీద కేసులు నమోదయ్యాయి.
- బంజారాహిల్స్ రోడ్ నంబర్ 14లోని భాగ్యనగర్ స్టూడియోస్ స్థలం పక్కన సుమారు రూ.100 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్ని కాజేసేందుకు అబ్దుల్ ఖలీద్ ప్రయత్నాలు చేస్తున్నాడు. దీంతో అక్కడ రెవెన్యూ సిబ్బంది పలుమార్లు బోర్డులు పెట్టడం, ఖాలీద్, అతడి అనుచరులు వాటిని తొలగించి ప్రైవేటు బోర్డులు రాయడం పరిపాటిగా మారింది. బోర్డులు తొలగించినందుకు ఇప్పటివరకు ఖాలీద్‌పై మూడుసార్లు కేసులు నమోదయ్యాయి.
- జూబ్లీహిల్స్ రోడ్ నెంం 46లోని అంబేద్కర్ కాలనీని అనుకుని జేఎన్ఆర్ఎమ్ ఇండ్ల పక్కన సుమారు 1500 గజాల ప్రభుత్వ స్థలాన్ని కాపాడేందుకు బోర్డులు పెడితే.. కొందరు వాటిని తొలగించడంతో రెండుసార్లు కేసులు నమోదయ్యాయి.
- బంజారాహిల్స్ రోడ్ నెం 12లోని ఎమ్మెల్యే కాలనీలో ప్రభుత్వ స్థలం వద్ద ఏర్పాటు చేసిన బోర్డులను గతంలో తొలగించడంతో పాటు షీట్లను తీసేయడంతో కేసు నమోదయ్యింది.
- ఎమ్మెల్యే కాలనీని అనుకుని ఉన్న దిల్ ల్యాండ్స్‌లో ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తే వెంటనే తొలగిస్తున్నారు.
- షేక్‌పేట డివిజన్ పరిధిలో పలు కాలనీల్లో యూఎల్‌సీ ల్యాండ్స్‌లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తే వెంటనే తొలగిస్తున్నారు.
- జూబ్లీహిల్స్ డివిజన్ పద్మాలయ అంబేద్కర్‌నగర్ బస్తీలో స్కూల్ దిగువ భాగంలో ప్రభుత్వ స్థలంలో వెలిసిన రెండు గుడిసెలు కూల్చేసిన రెవెన్యూ అధికారులు ప్రభుత్వ హెచ్చరికబోర్డులు ఏర్పాటు చేయగా రెండ్రోజుల క్రితం వాటిని తొలగించారు.

### నామమాత్రపు కేసులతోనే సరిపెడుతున్న పోలీసులు

ప్రభుత్వ స్థలాలను కాపాడటమే రెవెన్యూ అధికారులకు అత్యంత ప్రాధాన్యత అంశంగా ఉంటుంది. ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించేవారిపై కఠినంగా వ్యవహరించాల్సిన బాధ్యత పోలీసులపై ఉంది. అయితే రోజువారీ పని ఒత్తిడి, బందోబస్తులతో బిజీగా ఉంటున్న పోలీసులు ప్రభుత్వ స్థలాల కబ్జాల విషయంలో నమోదవుతున్న కేసుల దర్యాప్తులో కొంతమేర ఉదాసీనంగా వ్యవహరిస్తుండటమే కబ్జాదారుల ధైర్యానికి కారణమని అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ స్థలంలో బోర్డులు తొలగించడం, స్థలం లోపలికి ప్రవేశించిన వారిపై నమోదయ్యే కేసుల్లో కేవలం నోటీసులు మాత్రమే ఇవ్వడం, కేసుల దర్యాప్తులో కూడా లోతుగా వెళ్లకపోవడం కూడా కబ్జాదారులకు అలుసుగా మారిందని అరోపణలున్నాయి. పలుమార్లు ప్రభుత్వ స్థలాలను అక్రమించే ప్రయత్నాలు చేసేవారిపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టడం, వీలుంటే ఆర్గనైజ్డ్ క్రైమ్ కింద పరిగణించి గట్టి కేసులు పెడితేనే ఆక్రమణ ప్రయత్నాలు కొంతైనా తగ్గుతాయని రెవెన్యూ అధికారులు అంటున్నారు. ప్రభుత్వం కూడా ఆ దిశగా వెంటనే దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.